తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
28 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 319
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## ఆపరేషన్ సిందూర్‌లో ఎస్-400 కీలక పాత్ర

- పాకిస్థాన్ ప్రయత్నాలు విఫలమయ్యాయని వెల్లడి
- ఎస్-400 స్థానాల కోసం స్లీపర్ సెల్స్ వినియోగం
- వాయు రక్షణ వ్యవస్థ సామర్థ్యాలపై మాజీ అధికారి వ్యాఖ్యలు
- భారత గగనతల భద్రతకు బలమైన కవచంగా ఎస్-400

న్యూఢిల్లీ, ఆగస్టు 27 భారత్--పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు దారితీసిన 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా భారత ఎస్-400 వాయు రక్షణ వ్యవస్థలు అత్యంత కీలక పాత్ర పోషించాయని భారత వైమానిక దళ మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా వెల్లడించారు. ఆ సమయంలో భారత వైమానిక దళ పశ్చిమ కమాండ్‌కు అధిపతిగా పనిచేసిన ఆయన, ఒక ఇంటర్వ్యూలో ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. భారత గగనతల రక్షణలో ఎస్-400 వ్యవస్థలు ఎంత ప్రభావవంతంగా పనిచేశాయో ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వ్యవస్థల స్థానాలను గుర్తించేందుకు పాకిస్థాన్ తీవ్రంగా ప్రయత్నించిందని జితేంద్ర మిశ్రా తెలిపారు. గూఢచార వ్యవస్థలు, నిఘా వనరులు, దేశంలో ఉన్నట్లు భావిస్తున్న స్లీపర్ సెల్స్‌ను కూడా వినియోగించినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా కొన్ని విదేశీ

➤ మిగతా 2వ పేజీలో..

# హిమాలయాన్ని కుదిపేసిన నేపాల్ మహావిపత్తు

- 168 మందికి పైగా మృతి.. వేలాది మంది గల్లంతు
- హిమనదం కూలిపోవడంతో విరుచుకుపడ్డ జలప్రళయం
- కైలాస్ యాత్రికులు, విదేశీ పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు
- మరో వరద ముప్పుపై అధికారుల హెచ్చరిక



ఖాట్మండు, ఆగస్టు 27: నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు అపూర్వ విధ్వంసాన్ని సృష్టించాయి. హిమాలయాల్లోని ఒక భారీ హిమనదం కూలిపోవడంతో ఏర్పడిన నీరు, బురద, రాళ్ల ప్రవాహం భోటే కోషి, త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతాలపై విరుచుకుపడింది. తాజా సమాచారం ప్రకారం మృతుల సంఖ్య 165 నుంచి 168 మధ్యకు చేరుకోగా, 1,300 నుంచి 1,500 మంది వరకు ఇంకా గల్లంతైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నేపాల్ చరిత్రలో ఇటీవలి కాలంలో సంభవించిన అత్యంత ఘోర ప్రకృతి విపత్తుల్లో ఇది ఒకటిగా నిలిచింది. బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం సుమారు 8:40 గంటల సమయంలో ఈ విపత్తు సంభవించింది. మొదట భూకంపం వచ్చినట్లు భావించిన అధికారులు, అనంతర పరిశీలనలో ఇది హిమనదం కుప్పకూలడం వల్ల

➤ మిగతా 2వ పేజీలో..

## రక్షాబంధన్ సందర్భంగా జగన్ శుభాకాంక్షలు

- అక్కచెల్లెమ్మలకు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్
- ఆత్మీయత, అనురాగాల పండుగగా రాఖీ విశేషం
- మహిళలందరికీ మంచి జరగాలని ఆకాంక్ష
- దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని సందేశం

తాడేపల్లి, ఆగస్టు 27 : రక్షాబంధన్ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సందేశంలో రాష్ట్రంలోని ప్రతి అక్కకు,

➤ మిగతా 2వ పేజీలో..



## అమరావతి నిర్మాణ పనులపై సీఎం సమీక్ష

➤ 2వ పేజీలో..

## తుమ్మిడిహట్టి బ్యారేజీపై సెప్టెంబర్ 1న కీలక భేటీ

- ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో సమావేశం
- పాల్గొననున్న తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు
- సాగునీటి లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు



హైదరాబాద్, ఆగస్టు 27 ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేపట్టిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఈ సమావేశం ఏర్పాటు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర

➤ మిగతా 2వ పేజీలో..

# బీఆర్ఎస్‌పై అంతర్గత కుట్రలు జరుగుతున్నాయ్



- హరీశ్‌రావు వ్యవహారశైలిపై కవిత తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్‌ను పక్కనబెట్టి పార్టీపై నియంత్రణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 27 తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌ను కొందరు నేతలు హస్తగతం చేసుకునేందుకు అంతర్గతంగా ప్రయత్నాలు చేస్తున్నారని, పార్టీ భవిష్యత్ నాయకత్వంపై రహస్య చర్చలు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు.

బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ వంటి నాయకుడిని పక్కనబెట్టి పార్టీపై పూర్తి నియంత్రణ సాధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందన్నారు. ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశాల్లో పార్టీ

➤ మిగతా 2వ పేజీలో..

## ఏఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



నిజామాబాద్,ఆగస్ట27 మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ

➤ మిగతా 2వ పేజీలో..



# విద్య,వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

- గోపాలపురం పాఠశాలకు నూతన తరగతి గదులు
- రూ.30 లక్షల పనులకు మంత్రి శంకుస్థాపన
- సాంకేతిక విద్యతో యువతకు అవకాశాలు
- మహిళలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన పొంగులేటి

ఖమ్మం, ఆగస్టు 27: తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని గోపాలపురంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం

➤ మిగతా 2వ పేజీలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
శుక్రవారం, 28 ఆగస్టు , 2026


# ఆపరేషన్ సిందూర్‌లో ఎస్-400 కీలక పాత్ర

ఉపగ్రహాల ద్వారా కూడా సమాచారం సేకరించేందుకు ప్రయత్నాలు జరిగినట్లు వెల్లడించారు. అయితే భారత భద్రతా వ్యవస్థల అప్రమత్తత కారణంగా ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని ఆయన స్పష్టం చేశారు.ఎస్-400 వ్యవస్థలు మోహరించిన ప్రాంతాలకు సమీపంలోకి రావడానికి కూడా పాకిస్థాన్ యుద్ధ విమానాలు వెనుకంజ వేసినట్లు జితేంద్ర మిశ్రా పేర్కొన్నారు. ఈ వాయు రక్షణ వ్యవస్థల సామర్థ్యంపై వారికి ఉన్న అవగాహన కారణంగానే భారత సరిహద్దులకు సుమారు 200 కిలోమీటర్ల దూరంలోనే ఉండాల్సి వచ్చిందని వివరించారు. పాకిస్థాన్ ఫైటర్ జెట్‌లు గాల్లోకి వచ్చిన ప్రతిసారీ వాటిని లక్ష్యంగా చేసుకునేందుకు ఎస్-400 సిద్ధంగా ఉండేదని తెలిపారు. ఆపరేషన్ సమయంలో జరిగిన ఒక ప్రత్యేక సంఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. 2025 మే 10న పాకిస్థాన్ భూభాగంలో సుమారు 314 కిలోమీటర్ల దూరంలో ఎగురుతున్న ఒక నిఘా విమానాన్ని లక్ష్యంగా చేసుకుని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భూమిపై నుంచి గగనతలంలోని లక్ష్యాన్ని అత్యంత సుదూరం నుంచి ఛేదించే సామర్థ్యం ఎస్-400 వ్యవస్థలకు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సంఘటన ఆధునిక వాయు రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని వ్యాఖ్యానించారు.భారత్ 2018లో రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఐదు ఎస్-400 వాయు రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసింది. దశలవారీగా ఈ వ్యవస్థలు భారత సాయుధ దళాలకు అందుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయానికి మూడు వ్యవస్థలు సేవల్లో ఉండగా, అనంతరం మరిన్ని యూనిట్లు కూడా అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం. వీటి ద్వారా దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతమైందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. భారత గగనతల భద్రతను మరింత దుర్భేద్యంగా మార్చడంలో ఎస్-400 వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ వ్యవస్థలు శత్రు విమానాలు, క్షిపణులు, నిఘా వనరులను గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని ఆయన వివరించారు. భవిష్యత్తులో కూడా భారత రక్షణ వ్యూహంలో ఎస్-400 వంటి అధునాతన వ్యవస్థలు కీలకంగా నిలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రక్షాబంధన్ సందర్భంగా జగన్ శుభాకాంక్షలు



ప్రతి చెల్లెమ్మకు, ప్రతి బాలికకు, ప్రతి మహిళకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ అనేది కేవలం ఒక సంప్రదాయ పండుగ మాత్రమే కాదని, ఆత్మీయత, అనురాగాలు, ప్రేమాభిమానాలను ప్రతిబింబించే ప్రత్యేక సందర్భమని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర విశ్వాసాన్ని, ఆప్యాయతను మరింత బలోపేతం చేసే పర్వదినమని వివరించారు.రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ ఎల్లప్పుడూ మంచి జరగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. వారి జీవితాలు సుఖసంతోషాలతో నిండాలని, కుటుంబాలు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. మహిళలు సమాజంలో మరింత గౌరవం, గుర్తింపు పొందాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి మహిళ కుటుంబానికి, సమాజానికి ఆధార స్తంభంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. తల్లి, అక్క, చెల్లి, భార్య వంటి అనేక పాత్రలను సమర్థంగా నిర్వహిస్తూ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. వారి కృషి, త్యాగాలు సమాజ అభివృద్ధికి కీలకమని వివరించారు.ఈ పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందోత్సాహాలను నింపాలని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమాభిమానాలు మరింత బలపడాలని వైఎస్ జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. కుటుంబ బంధాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరస్పర గౌరవం, ఆదరణతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి అక్క, ప్రతి చెల్లెమ్మకు దేవుడి చల్లని దీవెనలు ఎల్లకాలం ఉండాలని వైఎస్ జగన్ ప్రార్థించారు. ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శ్రేయస్సు వారికి లభించాలని కోరుకుంటున్నానని తెలిపారు. రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబానికి శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తుమ్మిడిహట్టి బ్యారేజీపై సెప్టెంబర్ 1న కీలక భేటీ

జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించనున్నారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం గత కొంతకాలంగా కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలని కోరారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన కేంద్ర సంస్థలు సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించాయి.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారు. అనంతరం ప్రధానమంత్రి కార్యాలయం ఈ అంశాన్ని జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. తదనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ప్రాజెక్టు విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అనుమతి పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తరలించడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగించాల్సి వస్తుందని తెలంగాణ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. దీని వల్ల విద్యుత్ వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వివరించింది.

తక్కువ విద్యుత్ వ్యయంతో పాటు దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదనగా ఉంది. కేంద్ర జల మరియు విద్యుత్ పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిర్వహించిన అధ్యయనాల ప్రకారం బ్యారేజీ జలమట్టాన్ని పెంచడం వల్ల అదనపు ముంపు పరిమిత స్థాయిలోనే ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వివరించింది. ఈ అంశంపై సాంకేతిక నివేదికలు కూడా సమర్పించినట్లు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతంతో పాటు వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించడంలో తుమ్మిడిహట్టి బ్యారేజీ కీలక పాత్ర పోషించనుంది.

# హిమాలయాన్ని కుదిపేసిన నేపాల్ మహావిపత్తు



జరిగిన భారీ శిథిల ప్రవాహమని నిర్ధారించారు. వేల టన్నుల మంచు, రాళ్లు, మట్టి ఒక్కసారిగా లోయల్లోకి దూసుకెళ్లడంతో నదుల్లో జలప్రవాహం అమాంతం పెరిగి దిగువ ప్రాంతాలను ముంచెత్తింది. సీసీటీవీ దృశ్యాల్లో బహుళ అంతస్తుల భవనాల ఎత్తుకు సమానంగా బురద, నీటి గోడ దూసుకురావడం కనిపించడం విపత్తు తీవ్రతను తెలియజేస్తోంది. రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. పలు గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. కనీసం 19 వంతెనలు, 40 కిలోమీటర్లకు పైగా రహదారులు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమవడంతో విద్యుత్ సరఫరా దెబ్బతింది. అనేక ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. గల్లంతైన వారిలో విదేశీ పర్యాటకులు, కైలాస్ మానససరోవర్ యాత్రికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. నేపాల్ అధికారుల వివరాల ప్రకారం వందలాది విదేశీయుల ఆచూకీ ఇంకా లభించలేదు. భారతీయులు, అమెరికన్లు, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, కెనడా, మలేషియా తదితర దేశాల పౌరులు గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు. భారత విదేశాంగ శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తుండగా, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దాదాపు 300 మంది భారతీయులు గల్లంతైన వారిలో ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి వెల్లడించారు.

విపత్తు ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. నేపాల్ సైన్యం, పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో గాలింపు చేపడుతున్నాయి. ఇప్పటివరకు వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే భారీ బురద, దెబ్బతిన్న రహదారులు, కొనసాగుతున్న వర్షాలు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. అనేక ప్రాంతాల్లో శిథిలాల కింద ఇంకా ప్రజలు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ విపత్తు ప్రభావం నేపాల్‌కే పరిమితం కాలేదు. సరిహద్దు అవతల టిబెట్‌లో కూడా ప్రాణనష్టం సంభవించింది. చైనా అధికారులు వందలాది సహాయక సిబ్బందిని రంగంలోకి దించారు. ఐక్యరాజ్యసమితి, రెడ్ క్రాస్, పలు దేశాలు అత్యవసర సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించగా, నేపాల్ ప్రభుత్వం అంతర్జాతీయ సహకారం కోరుతోంది.

ఇదిలా ఉండగా, శాస్త్రవేత్తలు మరో ప్రమాదంపై హెచ్చరిస్తున్నారు. హిమనదం కూలిన ప్రాంతంలో నదీ ప్రవాహాన్ని అడ్డుకుంటూ భారీ మట్టి, రాళ్ల అడ్డంకి ఇంకా కొనసాగుతోందని, అది ఒక్కసారిగా తెగిపోతే రెండోసారి వరదలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నేపాల్‌తో పాటు భారత సరిహద్దు రాష్ట్రాలైన బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోనూ అప్రమత్తత ప్రకటించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు వేగంగా కరుగుతున్నాయని, ఇలాంటి విపత్తుల ముప్పు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్లేసియర్‌ల అస్థిరత, తీవ్రమైన వర్షాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కలిసి హిమాలయ ప్రాంతాన్ని ప్రమాదకర మండలంగా మారుస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపాల్ విపత్తు ప్రపంచానికి మరోసారి ప్రకృతి హెచ్చరికగా నిలిచిందని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేపాల్ అంతటా విషాదఛాయలు అలుముకున్నాయి. గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు ఆందోళనగా ఎదురుచూస్తుండగా, సహాయక బృందాలు శిథిలాల మధ్య ప్రాణాలతో బయటపడిన వారిని వెతికే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. ఈ విపత్తు హిమాలయ ప్రాంత చరిత్రలో అత్యంత విషాదకర ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటిగా నమోదు కానుంది.

# బీఆర్ఎస్‌పై అంతర్గత కుట్రలు జరుగుతున్నాయ్

భవిష్యత్ వ్యూహాలు, వారసత్వ రాజకీయాలపై చర్చలు జరిగినట్లు ఆరోపించారు.

**హరీశ్‌రావుపై ఆర్థిక ఆరోపణలు**

హరీశ్‌రావు గతంలో మంత్రిగా ఉన్న సమయంలో కొన్ని ప్రైవేటు సంస్థలతో భారీ స్థాయిలో వ్యాపార సంబంధాలు కొనసాగించారని కవిత ఆరోపించారు. విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులతో జరిగినట్లు చెబుతున్న వ్యాపార వ్యవహారాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లండన్‌లో జరిగినట్లు చెబుతున్న కొన్ని సమావేశాల వెనుక ఉన్న అంశాలను కూడా దశలవారీగా ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

**రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదని ఆరోపించారు. కృష్ణా జలాల పంపిణీ, ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి సంబంధించిన సంస్థల్లో నియామకాలు, తెలంగాణకు రావాల్సిన హక్కుల విషయంలో ప్రభుత్వం మరింత దృఢంగా పోరాడాలని సూచించారు.

**బీఆర్ఎస్ తీరుపైనా అసంతృప్తి**

ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో పోరాటం చేయడం లేదని కవిత విమర్శించారు. అధికార కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ రాజీ పడిందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలపై ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

**బీసీలకు సామాజిక న్యాయం కావాలి**

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం, స్థానికులకు అవకాశాలు కల్పించడంలో ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని కవిత ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా, మహిళలకు భద్రత, వెనుకబడిన వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

**ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా టీఆర్ఎస్**

తెలంగాణ రక్షణ సేనను ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కవిత ప్రకటించారు. అవినీతి రహిత పాలన, పారదర్శకత, జవాబుదారీతనం కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడకుండా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# అమరావతి నిర్మాణ పనులపై సీఎం సమీక్ష

- సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం నిర్వహణ
- రాజధాని అభివృద్ధి పనుల పురోగతిపై చర్చ
- కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సమీక్ష
- వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆగస్టు 27 ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాజధాని ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రాజెక్టుల అమలు వేగం, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. సమావేశానికి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ. నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయ్ రామరాజు తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

అమరావతిలో చేపడుతున్న రహదారులు, ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు, మౌలిక సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థలు, ప్రజా అవసరాల ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. ఇప్పటికే ప్రారంభమైన పనులు ఏ దశలో ఉన్నాయనే అంశంపై అధికారులు నివేదికలు సమర్పించారు. పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసే అంశంపై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. అలాగే నిర్మాణ పనులను చేపడుతున్న కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, సాంకేతిక అంశాలు, నిధుల వినియోగం, పనుల వేగవంతం వంటి అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పనులు మరింత వేగంగా ముందుకు సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజధాని అమరావతి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రాజధానిని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు వివరించారు. నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని సమావేశంలో అభిప్రాయపడిన ముఖ్యమంత్రి, ప్రాజెక్టుల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమరావతి అభివృద్ధి ప్రక్రియకు మరింత ఊతమివ్వనున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# విద్య,వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

జరిగిన సభలో మాట్లాడుతూ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.

గత పాలకులు అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించిన మంత్రి, ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు గతంతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు అధిక నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మిస్తూ, వైద్యులు, సిబ్బందిని నియమిస్తున్నామని వివరించారు. సాంకేతిక విద్య బలోపేతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యతనిస్తూ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి యువతే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు.మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు గత రెండున్నరేళ్లలో భారీ స్థాయిలో రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 31లోపు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి హాజరైన మహిళలతో పాటు పాలేరు నియోజకవర్గం, రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముందస్తుగా రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 28 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఖమ్మం గడ్డపై ఉద్యోగుల మహాగర్జన

## ముదిగొండ పోలీస్ స్టేషన్ ను సందర్శించి తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును పరిశీలించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టర్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ మురళి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత





**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ ఆగస్టు 27 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని అరూర్ గ్రామంలో రవ్వ సత్యం అనారోగ్యంతో మరణించడం జరిగింది.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 5 వేల రూపాయలు మరియు వేములకొండ గ్రామానికి చెందిన సాంబయ్య చారి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్, శ్రీశైలం,వార్డు మెంబెర్స్ డైరెక్టర్లు.కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ రాామ్రెడ్డి,ఏర్పుల వెంకటేశం,పులిపలుపుల రాములు,ఎస్కే రసూల్, సాయి కుమార్,యూత్ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ ఆగస్టు 27 తరంగాలు**

వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా వలిగొండకు చెందిన బత్తిని సహదేవ్ గౌడ్ ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు,గంధ మల్ల నరసింహ,ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి,దండెం సరిత, గంగాపురం సాయిబాబా, సూదిని రాజశేఖర్ రెడ్డి, అదేవిధంగా కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం,గంగాపురం సంధ్యారాణి,కసర బోయిన నరసింహ, బండారి అనిత,కళ్లెం బాల శంకర్ గౌడ్,రేకల బాలరాజ్ గౌడ్, ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య,ఎమ్మె నవ్య, ఎడవెల్లి మల్లేశం,జక్కుల శోభ రాణి,దండ మల్లికార్జున్,మాదాసు రాణి,కేసరి మహేందర్ రెడ్డి,కందుల నరేష్,కళ్లెం రాములు ను ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు.రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని, పేదలకు అందుతున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వం సాగునీటి కాలువల విషయంలో నిర్లక్ష్యం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువలకు ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేసి సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టిందని అన్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు,సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి,వలిగొండ, ముద్దాపురం గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి,సామ రామ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని లింగయ్య,గంగాపురం సతీష్,రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డి,గూడూరు శ్రీధర్ రెడ్డి,గుండు దానయ్య గౌడు,వెంకన్న గౌడ్,మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్, ఎమ్మె లింగస్వామి,ఉలిపే మల్లేశం తదితరులు పాల్గొన్నారు.







- జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన అశేష ఉద్యోగులు
- 5,000 మంది ఉద్యోగుల ఐక్య నినాదంతో విజయవంతమైన టీ జీ ఈ జె ఎసి మహాధర్నా
- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పణ

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**

ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ఆర్థిక సర్వీస్ ప్రయోజనాల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీ ఈ జెఏసి), ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి కార్యాలయం ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు.ఉదయం 10 గంటలకు ప్రారంభమైన మహాధర్నా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ,గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు,కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలకు చెందిన సుమారు 5,000 మంది ఉద్యోగులు భారీగా హాజరై తమ ఐక్యతను, సంఘటిత శక్తిని చాటారు.ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావడం, ఉద్యోగుల సమస్యల పట్ల ఉన్న ఆవేదనకు, ఐక్యతకు నిదర్శనంగా నిలిచిందిమహాధర్నాకు టీ జీ ఈ జెఏసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు సమన్వయం చేశారు.వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపి వారికి ఆర్థిక, సేవా, ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని టీ జీ ఈ జె ఎసి నాయకులు కోరారు. 1).2వ పే రివిజన్ కమిషన్ (పి ఆర్ సి) నివేదికను వెంటనే తెప్పించి, నిర్ణీత గడువులోగా అమలు చేయాలి. 2).పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి. 3).సుమారు రూ.10,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను త్వరితగతిన చెల్లించాలి.4). సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్)ను పునరుద్ధరించాలి.5).ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈ హెచ్ ఎస్/ఎన్ ఈ హెచ్ ఎస్)ను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి. 6).సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి"గుంటుపల్లి శ్రీనివాసరావు

ఈ సందర్భంగా టి జి ఈ జె ఏ సి ఖమ్మం జిల్లా చైర్మన్ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లా ఉద్యోగులు మరోసారి తమ ఐక్యత, క్రమశిక్షణ, సంఘటిత శక్తిని చాటారని అన్నారు.సుమారు 5,000 మంది ఉద్యోగులు ఒకే వేదికపైకి వచ్చి మహాధర్నాను విజయవంతం చేయడం ఉద్యోగుల ఐక్యతకు గొప్ప నిదర్శనమన్నారు. ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్క శాఖకు, ఏ ఒక్క సంఘానికి సంబంధించినవి కావని, మొత్తం ఉద్యోగ వర్గానికి సంబంధించిన సామూహిక సమస్యలని ఆయన పేర్కొన్నారు.

2వ పై ఆర్ సి, 6 డి ఎ లు, , పెండింగ్ బిల్లులు, సి పి ఎస్ రద్దు--ఒ పి ఎస్ పునరుద్ధరణ వంటి అంశాలు ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక భద్రత, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాలపై ఉద్యోగుల్లో ఆవేదన ఉందని, ఆ ఆవేదనను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో అర్థం చేసుకుని పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు."ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సేవలందించేది ఉద్యోగ వర్గమే. అదే సమయంలో ఉద్యోగుల న్యాయమైన సమస్యలు కూడా పరిష్కారం కావాలని కోరుకోవడం సహజం. ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నాం"అని గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు.ఉద్యోగుల ఐక్యతను మరింత బలోపేతం చేసుకుని, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు."మన సమస్యలపై మనమంతా ఒక్క గొంతుగా మాట్లాడితేనే మన విన్నపానికి మరింత బలం వస్తుంది. ఐక్యతను కాపాడుకుంటూ,క్రమశిక్షణతో, ప్రజాస్వామ్య పద్ధతిలో మన న్యాయమైన హక్కుల సాధన కోసం ముందుకు సాగుదాం"అని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడితే ఉద్యోగ వర్గాల్లో మరింత నమ్మకం, ఉత్సాహం పెరుగుతుందని ఆయన అన్నారు.ఈ రోజు ఉదయం కురిసిన భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 5,000 మంది ఉద్యోగులు, పెన్షనర్లు హాజరు కావడం వారి ఆవేదనను తెలియజేస్తోందన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులది ప్రత్యేక పాత్ర అని, అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యంత నిర్లక్ష్యానికి గురైన వర్గాల్లో ఉద్యోగ వర్గం కూడా ఉందని ఆయన అన్నారు. ఇదే ఉత్సాహంతో వచ్చేనెల 10వ తారీఖున హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి ఖమ్మం నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని కోరారు."ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారమే మన లక్ష్యం" అని స్పష్టం చేశారు. అన్ని ఉద్యోగ సంఘాల సమన్వయంతోనే మహాధర్నా విజయవంతం: కొంగర వెంకటేశ్వరరావుటి జి ఈ ఎ సి ఖమ్మం జిల్లా కన్వీనర్ శ్రీ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు సమన్వయంతో పాల్గొనడం వల్లే మహాధర్నా విజయవంతమైందన్నారు.ఉద్యోగుల ఆర్థిక, సేవా, పెన్షన్, ఆరోగ్య సంబంధిత సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాల మధ్య సమన్వయం, ఐక్యత అవసరమన్నారు.పి ఆర్ సి , డి ఏ లు, ఈ హచ్ ఎస్, పెండింగ్ బిల్లులు, సి పి ఎస్ రద్దు--ఒ పి ఎస్ పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.భవిష్యత్తులో కూడా ఉద్యోగుల ప్రయోజనాల కోసం అన్ని భాగస్వామ్య సంఘాలను సమన్వయం చేసుకుంటూ ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఉద్యోగుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి: భాగస్వామ్య సంఘాల నాయకులు మహాధర్నాలో పాల్గొన్న వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్క సంఘానికి పరిమితమైనవి కావని, మొత్తం ఉద్యోగ వర్గానికి సంబంధించినవని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఆర్థిక బాధ్యతలు, పెండింగ్‌లో ఉన్న డి ఏ లు, పి ఆర్ సి అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ఆరోగ్య పథకం అమలు వంటి అంశాలు ఉద్యోగులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు.ప్రభుత్వం ఉద్యోగుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఉద్యోగులు ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని, అదే సమయంలో వారి న్యాయమైన సమస్యలకు కూడా పరిష్కారం లభిస్తే ఉద్యోగుల్లో మరింత ఉత్సాహం, నిబద్ధత పెరుగుతుందని నాయకులు అన్నారు.మహాధర్నా అనంతరం కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ మధ్యాహ్నం 2 గంటలకు మహాధర్నా ముగిసిన అనంతరం కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు భారీ ర్యాలీగా ఖమ్మం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఉద్యోగుల నినాదాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది.అనంతరం టీ జీ ఈ జె ఎసి ఖమ్మం జిల్లా నాయకులు, వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ గారిని కలసి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో 2వ పై ఆర్ సి అమలు, 6 పెండింగ్ డి ఏ ల విడుదల, సుమారు రూ.10,000 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఈ హచ్ ఎస్/ ఎన్ ఈ హచ్ ఎస్ సమర్థవంతమైన అమలు, సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణతో పాటు ఉద్యోగుల ఇతర న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టేలా సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి వినతిపత్రాన్ని పంపించాలని జిల్లా కలెక్టర్‌ను టీజీ ఈ జేఏసీ నాయకులు కోరారు.

ఖమ్మం జిల్లా ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనంగా మహాధర్నా ఆగస్టు 27న జరిగిన టీజీ ఈ జెఏసి మహాధర్నా ఖమ్మం జిల్లా ఉద్యోగుల ఐక్యతకు, సంఘటిత శక్తికి నిదర్శనంగా నిలిచిందని టీజీ ఈ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. వివిధ ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ సంఘాలు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని నాయకులు వ్యక్తం చేశారు.ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించే వరకు ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో ప్రజాస్వామ్య పద్ధతిలో తమ విన్నపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే దశలవారీగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ మహాధర్నా కార్యక్రమానికి పెన్షనర్స్, టీఎస్ యు టిఎఫ్, టి పి టి ఎఫ్, మున్సిపల్ ఫోరం, ఇరిగేషన్ ఫోరం తదితర సంఘాలు భారీ ర్యాలీగా తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ధర్నా కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులకు రెవెన్యూ అసోసియేషన్ తరపున శ్రీ టి.సునీల్ రెడ్డి, టీ, స్నాక్స్, వాటర్ బాటిల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో టి జి ఈ జె ఏ సి నాయకులు టి.సునీల్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, కట్ట.శేఖర్, రంగారావు,రాయల నరసింహారావు ,ఎస్.కే. రంజాన్, దుర్గా భవానీ,రాజేష్,

విజయ్, వెంగలరావు,మోదుగు వేలాద్రి, కొణిదేన శ్రీనివాస్,ఎం. సుబ్బయ్య, టి. వేణు,వీరస్వామి, మల్లెల రవీంద్ర ప్రసాద్,యలమద్ది వెంకటేశ్వర్లు(వై.వి).,బిక్కు వెంకట రమణ, వెంకటేశ్వర్లు, వేంకటపతి రాజు, ధరావత్ రాములు, మట్టా శ్రీనివాస్, సింగారపు వేణు, నాగిరెడ్డి, కరంచంద్, పరిష పుల్లయ్య, శేష ప్రసాద్, పుష్ప రాజ్, రాంబాబు, ఉషశ్రీ, సుధారాణి, విజయ కుమారి, జెడ్.ఎస్. జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, బి.చంద్రశేఖర్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకరాచారి, కోటపాటి రుక్మారావు, అశ్లాం, జిలాని, గఫూర్, మృదుల, రాధికా రెడ్డి, లలిత కుమారి, విజయ, శ్రీధర్ సింగ్, వీరన్న, ప్రసాద్, నాగుల్ మీరా, గురుమూర్తి, కోమలి,ఆయుష్. ప్రకాష్, జి. వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బునాదిగాని కాలువ బాధిత రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలి

- సీపీఎం డిమాండ్



**యాదాద్రి భువనగిరి ఆర్సీ ,ఆగస్టు 27 (తరంగాలు):** బునాదిగాని కాలువ విస్తరణలో రెండో విడతగా భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం పులిగిల్ల గ్రామంలో బునాదిగాని కాలువ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో 2004లో బునాదిగాని కాలువ పనులు ప్రారంభమైనప్పటికీ, 22 ఏళ్లు గడిచినా రైతులు కనీసం ఒక్క పంట కూడా పండించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటివరకు ఐదుగురు ఎమ్మెల్యేలు, నాలుగు ప్రభుత్వాలు మారినా కాలువకు మాత్రం అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు.సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతాంగ ఉద్యమాల ఫలితంగా ఇటీవల రూ.265 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ, వాటిని సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు మందగించాయని తెలిపారు. 98 కిలోమీటర్లు కొనసాగాల్సిన కాలువ పనులు కేవలం 25 కిలోమీటర్ల మేర పూర్తయి, మధ్యలో నిలిచిపోయాయని పేర్కొన్నారు.నిధులను వెంటనే విడుదల చేసి కాలువ పనులను వేగవంతం చేయడంతో పాటు, రెండో విడతలో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29, 30, 31 తేదీల్లో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి, అనంతరం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి మారబోయిన నరసింహ, సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, నాయకులు దొడ్డి బిక్షపతి, కొమ్మిడి సత్తిరెడ్డి, వేముల ముత్తయ్య, వేముల అమరేందర్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# నిజాయితీగా ఉండే ఎమ్మెల్యే ఎన్నుకుంటే నియోజకవర్గం బాగుపడుతుంది





**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 27,(తరంగాలు** ):మండలంలోని సాగరం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 20లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంబొత్సవం చేసి మరో 10లక్షల సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. 2కోట్ల 26లక్షలతో నిర్మించిన 33/11కేవి సబ్ స్టేషన్ ను ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ప్రారంభించిన శిలాఫలకాన్ని సబ్ స్టేషన్ వద్ద ఆవిష్కరించారు. అలాగే గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించడంతో పాటు నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ సన్నాసులకు దమ్ముంటే, కాస్తంతయినా బుద్ధి ఉంటే కేసీఆర్ బిడ్డ కవిత స్వయంగా బిఆర్ఎస్ పై చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత బిఆర్ఎస్ పార్టీ ఫండ్లో ఉన్న 1400కోట్లు అక్రమంగా వచ్చినదే అని ఆ మొత్తాన్ని పార్టీ కార్యకర్తలకు పంచాలని డిమాండ్ చేస్తుందని దానికి సమాధానం చెప్పే దమ్ము బిఆర్ఎస్ నాయకులకు ఉందా అని సవాల్ విసిరారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయామనే అక్కసుతో, మళ్ళీ అధికారంలోకి రావాలనే ఆశతో కొన్ని యూట్యూబ్ చానళ్ళు కొని వాటి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో కొంతమందికి జీతాలు ఇచ్చి మరి నీచ స్థాయికి దిగజారి అబద్దాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టె ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇక బీజేపీ తెలంగాణ అభివృద్ధిని అడుగడుగునా అడ్డుకుటుందని ఆరోపించారు. తెలంగాణ నుండి 8ఎంపీలు ఉండి, 8మంది ఎమ్మెల్యేలు ఉండి తెలంగాణకు ఒక వెయ్యి కోట్ల ప్రాజెక్టు అయినా తీసుకువచ్చారా ప్రశ్నించారు. అసలు ప్రధాని మోడీకి మొదటి నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణను దోచుకున్న బిఆర్ఎస్ కు, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకున్న బీజేపీకి తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు సాగరం గ్రామానికి మొట్ట మొదటగా బిటీ రోడ్డు, వాటర్ ట్యాంక్ కట్టించింది కడియం శ్రీహరి అని తెలిపారు. మధ్యలో 20ఏళ్ళు ఎమ్మెల్యేలుగా ఉన్న వాళ్ళు ఎం చేశారో మీకే తెలుసని అన్నారు. మళ్ళీ ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్లలోనే ఒక్క సాగరం గ్రామానికే దాదాపు 10కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు తీసుకువచ్చానని వెల్లడించారు. 2కోట్ల 26లక్షలతో 33/11కేవి సబ్ స్టేషన్ నిర్మాణం, గ్రామంలో 2కోట్ల 50లక్షలతో పలు అభివృద్ధి పనులు, గర్నేపల్లి నుండి సాగరం వరకు రోడ్డు నిర్మాణానికి 3కోట్ల 50లక్షలు, సాగరం క్రాస్ నుండి వడ్డెరగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి 3కోట్ల 75లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. 6నెలలలో ఈ రెండు రోడ్ల పనులు పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. సాగరం గ్రామానికి కాకతీయుల కాలం నాటి దంసా చెరువు ఉందని తెలిపారు. 30ఏళ్ల క్రితం మంత్రిగా ఉన్నప్పుడు కోటి రూపాయలతో దంసా చెరువు కట్టను మరమ్మత్తు చేయించానని మధ్యలో వచ్చిన ఎమ్మెల్యేలు కనీసం అటువైపు కూడా చూడలేదని అన్నారు. దంసా చెరువులో 365రోజులు నీళ్లు ఉండే విధంగా ఉప్పుగల్ నుండి పాలకుర్తి వెళ్లే కెనాల్ పై షేటర్ నిర్మాణం చేయించి దంసా చెరువు కింద ఉన్న పూర్తి ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. తాగుడు, తినుడు, పదవులు, పథకాలు అమ్ముకునే వారిని ఎన్నుకుంటే ఎలా ఉంటుందో గత 15ఏళ్లలో మీరే చూసారని మీ ఎమ్మెల్యే ఎవరు అంటే చెప్పుకోవడానికే సిగ్గు పడే పరిస్థితులు ఉండేవని కాబట్టి నిజాయితీగా ఉంటూ పని చేసే వారిని ఎన్నుకుంటేనే గ్రామం అయినా నియోజకవర్గం అయినా అభివృద్ధి చెందుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాటికాయల మమత చైతన్య కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మాజీ సర్పంచ్ ఇన్నారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు,మోహన్ రావు, గోపు సోమయ్య,రమ,అరుణశ్రీ డైరెక్టర్ లు ఇల్లందుల బాబు, సురేష్ నాయక్,మండల నాయకులు,అన్నీబోఇన బిక్షపతి, రాజేష్ నాయక్, గుజ్జరి రాజు, సుదర్శన్ సుధాకర్ బాబు, మారపెల్లి ప్రభాకర్,బాషా, ఉపసర్పంచ్ కత్తుల సుమన్, ,కార్యకర్తలు,శ్రీను వెంకన్న, యూవరాజు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్క ఓటును కాపాడుకుందాం

• సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు



ఇల్లందు ప్రతినిధి, ఆగస్ట్ 27, ( తరంగాలు): రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలతో విజ యలక్ష్మినగర్ గ్రామపంచా యతీ లో సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా డిప్యూటీ తాసిల్దార్ సంధ్య హాజరైనారు. అనంతరం డీటీ సంధ్య, సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ, 2026 ఓటరు జాబితా లో నమోదు కాకుండా ఉన్న (అన్ -మ్యాపింగ్) ఓటరు నమోదు కు కావాల్సిన పత్రాలు గురించి,అదేవిధంగా 2026 ఓటరు జాబితా లొ ఉన్న తప్పుల సవరణకు కావాల్సిన పత్రాలు పై అవగాహన కల్పించారు. ఎవరికైతే నోటీసులు వచ్చాయో వారు తప్పకుండా సంబంధిత పత్రాలతో బి. ఎల్. ఓ లను సంప్రదించాలని తెలిపారు. ఈ గ్రామ సభకు వార్డు సభ్యులు హరిసింగ్, సదా, సౌజన్య, వసంత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అబ్దుల్ నభి, ఎట్టి హరికృష్ణ, పూనెం సురేందర్, వడ్ల శ్రీను,లాలు, కాశీ, కుమార్,బి ఎల్. ఓ లు కారం పద్మ, జి పద్మావతి,బి.ఎల్.ఏ లు వంశీ,రాజు, మోహన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందు 22వ వార్డులో వార్డు సభ ఓటర్లు ఆందోళన చెందొద్దన్న కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్



**ఇల్లందు ప్రతినిధి, ఆగస్ట్ 27, ( తరంగాలు)** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్. ఐ.ఆర్ ) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, బోగస్ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఇల్లందు మున్సిపాలిటీలోని 22వ వార్డు పరిధిలో ఉన్న 89వ పోలింగ్ బూత్ పరిధిలో వార్డు సభను నిర్వహించారు. ఈ వార్డు సభకు 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ఓటర్లకు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, తన వార్డు పరిధిలో మొత్తం 1254 ఓట్లు ఉన్నాయ ని, వాటిలో ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి షిఫ్టింగ్ అయినవారు, మృతి చెందిన వారు, అన్-మ్యాపింగ్ తదితర అంశాలను పరిశీలించి 1054 ఓట్లను నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఇంకా మిగిలిన ఓట్లలో 19 ఓట్లు అన్-మ్యాపింగ్ కింద గుర్తించామని, అనుమానా స్పదంగా ఉన్న మరో 203 మంది ఓటర్లకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని కౌన్సిలర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన 14 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒక పత్రాన్ని సమర్పించి తమ ఓటును నిరూపించుకోవ చ్చని సూచించారు. ముఖ్యంగా బర్త్ సర్టిఫికెట్, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, టెన్త్ మెమో, స్టడీ సర్టిఫికెట్, పాస్ పోర్ట్, బ్యాంకు పాస్ బుక్ వంటి ఏదైనా ఒక పత్రం చూపించి తమ ఓటు హక్కును కాపాడుకోవచ్చని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు ఓటు కూడా తొలగిపో కుండా చూసేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా కృషి చేస్తోందని, దీనికి వార్డు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో సూపర్ వైజర్ బాలరాజు, వార్డ్ ఆఫీసర్ రజిని, బిఎల్వో అజ్మీరా సక్కుబాయి, బిఎల్ఏ కోలపురి ఝాన్సీ, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆలేటి ఆనందరావు, 22వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్ పాసి, ప్రధాన కార్యదర్శి మాదాసు సుమన్, కాంగ్రెస్ నాయకులు శనిగారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యా రంగానికి దాతల సహకారం అభినందనీయం



- భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా మోహన్ రెడ్డి స్మారక భవనం
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
- చాడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నూతన పాఠశాల భవనం ప్రారంభం

**యాదాద్రి భువనగిరి ఆర్సి, ఆగస్టు 27, తరంగాలు**:విద్యా రంగానికి దాతల సహకారం అభినందనీయమని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు.మోటకొండూరు మండలం చాడ గ్రామంలో చాడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన భవనం నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి సహకరించిన చాడా ఫౌండేషన్ సభ్యులను, స్వర్గీయ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యా రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. స్వర్గీయ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ఈ భవనం చాడ గ్రామ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**స్టేషన్ ఘన్పూర్ ప్రతినిధి, ఆగస్టు 27,(తరంగాలు** ):మండల్ పెద్ద పెండ్యాల లోని వినాయక కన్వెన్షన్ లో సింగపురం జగన్ కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులైన క్రాంతి కిరణ్ సింధూర ను ఆశీర్వదించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ సింగపురం ఇందిర కుమారుడు సింగపురం ఇమ్మానుయేల్ రాజువారితోపాటు తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి మౌనిక, జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సింగపురం నాగయ్య, స్టేషన్ఘన్పూర్ సీనియర్ నాయకులు బొందయ్య, స్టేషన్ఘన్పూర్ మాజీ ఉపసర్పంచ్ సింగపురం వెంకటయ్య, జనగాం జిల్లా కార్యదర్శి చాగంటి మని, జిల్లా కార్యదర్శి తాటికొండ సంపత్ యాదవ్ హనంకొండ జిల్లా కార్యదర్శి బత్తిని ఎల్లాగౌడ్, చిల్పూర్ మండల బీసీ సెల్ అధ్యక్షులు బాలరాజు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సరిత, ధర్మసాగర్ మండల్ సీనియర్ నాయకులు బి దివాకర్, సీనియర్ నాయకులు గొట్టం శ్రీనివాస్ , ధర్మపురం మాజీ సర్పంచ్ గొట్టం రవి, , కొండపూర్ గణేష్ , రాజ్ కుమార్,యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్ కుమార్, సింగపురం ప్రతిష్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



# ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



- సర్పంచ్ గోపు సోమయ్య
- కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహణ

**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 27, (తరంగాలు** ):మండలంలోని తిడుగు గ్రామంలో 30వ తారీకు ఆదివారం రోజున ఉచితంగా కిమ్స్, హాస్పిటల్స్, భరత్ వర్షా ట్రస్ట్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ శిభిరం పోస్టర్ ను సర్పంచ్ గోపు సోమయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతా ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచితంగా క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుంది. ముందు కాలంలో క్యాన్సర్ అంటే 50 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల కానీ ఇప్పుడు ఉన్నా కాలంలో 30నుండి 40సంవత్సరాల లోపు వారికి ఎక్కువ మంది కి క్యాన్సర్ వస్తుంది.మనం క్యాన్సర్ వచ్చినంక ట్రీట్మెంట్ చేపించుకుంటే ఎంత ఫలితాలు ఉంటాయో ఒకవేళ క్యాన్సర్ రాకుండా ముందు దశలో గుర్తించి అంటే స్క్రీనింగ్ పరీక్షలు చేపించి ముందు దశలోనే గుర్తిస్తే వాటిని పూర్తిగా నయం చేసే అవకాశం ఎక్కువగా ఉంట్టుంది.అందుకోసమే ప్రతి ఊర్లో కూడా రెండు నెలలకోసారి స్క్రీనింగ్క్యాంపులానేవి కాండెక్ట్ చేయడం జరుగుతుంది. దీనికి ఎవరెవరు రావాల్సి ఉందంటే ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు ప్రతి ఒక్కరు కూడా క్యాంపు కు వచ్చి స్క్రీనింగ్ టెస్టులు చేపించుకోవాలి వీళ్ళలో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పెద్దపెగు క్యాన్సర్ గాని ఇలాంటి వాటిని ముందుగానే గుర్తించి చికిత్స చేసే అవకాశం ఉంట్టుంది. అదేవిదంగా 50సంవత్సరాలు దాటినాన ప్రతి మొగవారు ప్రోస్టేడ్ క్యాన్సర్ గాని, పెద్ద ప్రేయర్ క్యాన్సర్ గాని, నోటి క్యాన్సర్ గాని, ఇలాంటి వాటిని గుర్తించి ముందుగానే చికిత్స చేసే పూర్తిగా నయం అయ్యే అవకాశం ఉంట్టుంది. మీ ఇంట్లో గాని మీ బంధువుల్లో గాని క్యాన్సర్స్ ఉంటేఅలాంటి వాళ్ళు ఏజ్ తో సంబంధం లేకుండా ఏ వయసు వాళ్ళు అయినా టెస్ట్ చేపించు కోవచ్చు దాంతో పాటు ఇప్పుడు ఉన్నా కాలం లో సర్వైకల్ క్యాన్సర్ కి వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంది. దింతో పాటు క్యాన్సర్ తో పాటు మెడికల్ గడియాలాజి, సర్జికల్ అండ్ కాలేజీ సర్జికల్ ఆంకాలజీ, గైనకాలజీ పీడియాట్రీషియన్ ఇంటర్వెన్షనల్ కార్డాలజిస్ట్, సర్జికాలజీ, మీ వద్దకే వచ్చి అప్పటికప్పుడే పరీక్షలు చేసి ఆరోజే రిపోర్ట్స్ ఇచ్చి ఆరోజు డాక్టర్స్ కన్సల్టేషన్ కూడా అదే రోజు ఇచ్చి మెడిసిన్ అవసరమైతే బేసిక్ మెడిసిన్ కూడా అదే రోజు సంప్లై చేయడం జరుగుతుంది. ఈ సత్యోగాన్ని తిడుగు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరు కూడా తీసుకురండి ఇంతకుముందు ఎక్కడైనా హాస్పటల్లో చూపించుకుని ఉంటే ఆ రిపోర్ట్స్ తప్పనిసరిగా తీసుకురావాలి అదేవిధంగా ఎండస్కోప్ గాని బ్లడ్ టెస్టఅవసరం అవుతాయి కాబట్టి ప్రతి ఒక్కరు కూడా ఏమి తినకుండా ఉపవాసం తో వస్తే పరీక్షలు చేసి ఆ రిజల్ట్స్ కూడా వస్తేచెప్పి అప్పటికప్పుడు కన్సల్టెన్సీ ఇవ్వడానికి ఉపయోగపడతాయి. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు కూడా ఉపయోగించుకోవాలి.డాక్టర్ మధు దేవుశెట్టి ఆంకాలజిస్ట్,డాక్టర్ గంగాధర్ రేడియాలాజిస్ట్,డాక్టర్ స్నేహ పీడియాట్రీషన్, డాక్టర్ శ్యాంసుందర్ కార్డియాలజిస్ట్, వీరితోపాటు 50 మంది వైద్య బృందం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మీ దగ్గరికి వచ్చి అన్ని టెస్టులు చేసి కన్సల్టెన్సీ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాష, భాస్కర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు సై!

- పభుత్వ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు
- సెప్టెంబర్ 3న పాల్వంచలో పోటీలు.. 31లోగా దరఖాస్తులు
- జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి వెల్లడి

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 27:**
ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2025--26కు జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 3న పాల్వంచలోని మినీ స్టేడియం, విద్యుత్ కళాభారతి (కేటీపీఎస్)లో వివిధ క్రీడల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. సంబంధిత శాఖ జిల్లా అధికారి ధ్రువీకరించిన, సంతకం మరియు కార్యాలయ ముద్రతో కూడిన దరఖాస్తును ఆగస్టు 31వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జీ-19, భద్రాద్రి కొత్తగూడెంలో నేరుగా సమర్పించాలని సూచించారు. ఈ దరఖాస్తులను ఈమెయిల్ ద్వారా స్వీకరించబోమని, గడువు దాటిన తర్వాత వచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

### పలు క్రీడల్లో ఎంపికలు

పాల్వంచ మినీ స్టేడియంలో ఖో-ఖో (పురుషులు, మహిళలు), అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, కబడ్డీ క్రీడల్లో ఎంపికలు నిర్వహించనున్నారు.విద్యుత్ కళాభారతి, కేటీపీఎస్, పాల్వంచలో బాస్కెట్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, వాలీబాల్, క్రికెట్ (పురుషులు) విభాగాల్లో ఎంపికలు జరుగుతాయి.

### నిబంధనలు ఇవే

010 పద్దు ద్వారా జీతాలు పొందుతున్న ఉద్యోగులు మాత్రమే అర్హులని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అనుమతి లేదని అధికారులు తెలిపారు. ఒక ఉద్యోగి ఒక క్రీడలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీం గేమ్స్‌లో ఒక శాఖ నుంచి ఒక టీంకు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఎంపికైన క్రీడాకారులను తదుపరి రాష్ట్ర స్థాయి, అనంతరం జాతీయ స్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు పంపనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3న ఉదయం 8 గంటలకు ఎంపికల వేదిక వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.మరిన్ని వివరాలకు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డిని 9505423226 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

# భూముల రీసర్వేకు రెడీ





- భూభారతి, 22-ఏలో తేడాలపై తక్షణ పరిష్కారం
- ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసి సమగ్ర రీసర్వే
- కలెక్టర్లకు రెవెన్యూ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఆదేశాలు

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 27:**
తెలంగాణ రాష్ట్రంలో భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వేకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూభారతి డేటా ఆధారంగా భూముల వివరాలను పరిశీలించి, లోపాలు ఉంటే సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.ఈ సందర్భంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్‌కుమార్ మాట్లాడుతూ.. భూభారతి డేటా ఆధారంగా ఎక్కడైనా 22-ఏ ఎక్స్‌టెంట్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని భూభారతి పోర్టల్‌లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22-ఏ కింద నమోదైన భూములను గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో మండల తహసీల్దార్ల నుంచి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత ఉండేలా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను అమలు చేయాలని సూచించారు. ఎస్ఆర్ఓల్లో అందుతున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా రోజువారీగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

### ప్రతి మండలంలో ఓ గ్రామం

సమగ్ర భూ రీసర్వేలో భాగంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించాలని రెవెన్యూ కార్యదర్శి సూచించారు. ఎంపిక చేసిన గ్రామంలో రీసర్వే ద్వారా వచ్చే ఫలితాలను పరిశీలించి, వాటి ఆధారంగా దశలవారీగా అన్ని గ్రామాల్లో సమగ్ర రీసర్వే చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.భూభారతి డేటా, 22-ఏ భూముల వివరాలు, రీసర్వే అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సర్వే పై వార్డు సభను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 27, తరంగాలు** : ఖిలా వరంగల్ చింతల్ ప్రాంతంలోని మున్సిపల్ కమిటీ హాలులో ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వే పై నిర్వహించిన వార్డు సభను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డు సభలో చేపడుతున్న సర్ ప్రక్రియ, ఓటర్లకు కల్పిస్తున్న అవగాహన, ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత ఫాం ల ద్వారా సవరణలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.సర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ వార్డు సభ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట ఖిలా వరంగల్లు తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

## భూభారతి,22-ఏ,సమగ్ర రీసర్వేపై కలెక్టర్లతో రెవెన్యూ కార్యదర్శి సమీక్ష





**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 27, తరంగాలు:** రాష్ట్రంలోని భూభారతి, 22-ఏ, సమగ్ర రీసర్వేకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ భూభారతి డేటా ఆధారంగా ఎక్కడైనా 22-ఏ ఎక్స్‌టెంట్‌లో తేడాలు గుర్తిస్తే వాటిని భూభారతి పోర్టల్‌లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు 22-ఏ కింద నమోదై ఉన్నట్లయితే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసీల్దార్ల నుంచి వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ ప్రక్రియను సమర్ధవంతంగా అమలు చేసేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అమలు చేయాలని సూచించారు. ఎస్ఆర్ఓల్లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో సమగ్ర భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే ద్వారా వచ్చే సత్ఫలితాలను ఆధారంగా చేసుకుని తదుపరి అన్ని గ్రామాల్లో సమగ్ర రీసర్వే చేపట్టాల్సి ఉంటుందని రెవెన్యూ కార్యదర్శి స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి గ'మ్మత్తు'కు చెక్!



- మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- యువతను డ్రగ్స్ బారిన పడకుండా విస్తృత అవగాహన
- శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి : అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 27:** జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు, యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. ఐడీఓసీలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, గత సమావేశం నుంచి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

### యువతపై ప్రత్యేక దృష్టి

మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను దుర్భరం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలు, పని ప్రదేశాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, యువతతో పాటు కార్మికులకు కూడా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

### రవాణాపై నిఘా పెంచాలి

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఆర్టీసీ బస్సుల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అవకాశం లేకుండా కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి, అనుమానం ఉన్న సందర్భాల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నిర్మూలన ఒక్క శాఖతో సాధ్యం కాదని, పోలీస్, రవాణా, వ్యవసాయం, విద్య, కార్మిక తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

- రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 27, తరంగాలు:** జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, నీటి లభ్యత, భూసార పరిస్థితులకు అనుగుణంగా రైతులను ఆరుతడి పంటల సాగువైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి గురువారం క్షేత్రస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖల పనితీరును సమీక్షించారు. గత సంవత్సరం జిల్లాలో 1,39,997 ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 64,293 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 75,704 ఎకరాల్లో 33,438 ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వివరించారు. మిగిలిన విస్తీర్ణంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా గ్రామాల వారీగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఖానాపురం ప్రాంతంలో పాకాల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ వరి సాగు చేయవద్దని సూచించినా కొందరు రైతులు వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆరుతడి పంటలు సాగు చేయని రైతులను గుర్తించి, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆరుతడి పంటల సాగు లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని సూచించారు. అలాగే యూరియా, ఇతర ఎరువులను ఫర్టిలైజర్ యాప్ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో అక్రమంగా విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే ఎరువుల డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు ఫార్మర్ రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల సర్వేను కూడా త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావుతో పాటు వివిధ మండలాల వ్యవసాయ, ఉద్యానవన శాఖల క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలి

- ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు





**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 27, తరంగాలు:** ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయడంతో పాటు పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రగుళ్ల భరత్ ఆధ్వర్యంలో "ఫీజు బకాయిలు--బీజేపీ లడాయి" కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ సర్కిల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరై నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదన్నారు. విద్యార్థుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి అవసరమని పేర్కొన్నారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, కళాశాలల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, నాయకులు అంకాల జనార్ధన్, విప్ప సుధాకర్, ఇనుముల అరుణ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్, ఆడెపుల అభిరామ్ తేజ, మున్నా, అజయ్, వినయ్, కార్తీక్, రాజ్ కుమార్ గౌడ్, అభి తదితరులు పాల్గొన్నారు.

## ఓరుగల్లు కాంగ్రెస్ దళిత చైతన్య సభను విజయవంతం చేయాలి

- వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ సూరారపు నిరంజన్



వరంగల్ ప్రతినిధి,ఆగస్టు 27,తరంగాలు: ఈనెల 30న హనుమకొండ లోని హయగ్రీవ చారి గ్రౌండ్లో నిర్వహించనున్న ఓరుగల్లు కాంగ్రెస్ పార్టీ దళిత చైతన్య సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం వరంగల్ జిల్లా వైస్ చైర్మన్ సూరారపు నిరంజన్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతున్న సందర్భంగా వరంగల్ జిల్లాలోని దళితులందరూ ఈ నెల 30న జరుగు ఓరుగల్లు కాంగ్రెస్ దళిత చైతన్య సభను విజయవంతం చేయాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు,వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ ల పిలుపుమేరకు దళితులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రక్షాబంధన్ సందర్భంగా జగన్ శుభాకాంక్షలు

- అక్కచెల్లెమ్మలకు శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్
- ఆత్మీయత, అనురాగాల పండుగగా రాఖీ విశేషం
- మహిళలందరికీ మంచి జరగాలని ఆకాంక్ష
- దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని సందేశం



**తాడేపల్లి, ఆగస్టు 27 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** రక్షాబంధన్ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సందేశంలో రాష్ట్రంలోని ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి బాలికకు, ప్రతి మహిళకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ అనేది కేవలం ఒక సంప్రదాయ పండుగ మాత్రమే కాదని, ఆత్మీయత, అనురాగాలు, ప్రేమాభిమానాలను ప్రతిబింబించే ప్రత్యేక సందర్భమని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర విశ్వాసాన్ని, ఆప్యాయతను మరింత బలోపేతం చేసే పర్వదినమని వివరించారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలందరికీ ఎల్లప్పుడూ మంచి జరగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. వారి జీవితాలు సుఖసంతోషాలతో నిండాలని, కుటుంబాలు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. మహిళలు సమాజంలో మరింత గౌరవం, గుర్తింపు పొందాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి మహిళ కుటుంబానికి, సమాజానికి ఆధార స్తంభంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. తల్లి, అక్క, చెల్లి, భార్య వంటి అనేక పాత్రలను సమర్థంగా నిర్వహిస్తూ కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. వారి కృషి, త్యాగాలు సమాజ అభివృద్ధికి కీలకమని వివరించారు. ఈ పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందోత్సాహాలను నింపాలని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమాభిమానాలు మరింత బలపడాలని వైఎస్ జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. కుటుంబ బంధాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరస్పర గౌరవం, ఆదరణతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి అక్క, ప్రతి చెల్లెమ్మకు దేవుడి చల్లని దీవెనలు ఎల్లకాలం ఉండాలని వైఎస్ జగన్ ప్రార్థించారు. ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శ్రేయస్సు వారికి లభించాలని కోరుకుంటున్నానని తెలిపారు. రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబానికి శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 27, తరంగాలు :** జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం పనులను పరిశీలించారు. పరిశీలన అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు ఇతర పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఎంజీఎం సూపరింటెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్ ఎం.ఓ అశ్విన్,ఆర్.అండ్.బి. ఇ ఇ రాజేందర్, ఎలక్ట్రిసిటీ ఎస్ ఇ ఆనందం,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ సంబంధిత శాఖల అధికారులు,ఇంజినీర్లు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు

# తీజ్ ఉత్సవాలు గిరిజన సాంప్రదాయానికి ప్రతీక





• వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 27,తరంగాలు** : తీజ్ ఉత్సవాలు గిరిజన సం స్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం 2వ డివిజన్ గుండ్లసింగారంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో మయఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.గిరిజన దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గిరిజనుల అభివృద్ధి,సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తూ గిరిజన యువతులు జరుపుకునే తీజ్ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు.తీజ్ పండుగ గిరిజన బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన పండుగ అని అన్నారు.గిరిజన సమాజ ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.గిరిజనుల సంప్రదాయాలు,సంస్కృతి, ఆచారాలను తరతరాలకు కొనసాగిస్తూ భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు.బంజారా సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గిరిజన సోదర సోదరీమణులందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.డివిజన్ గిరిజన కోరిక మేరకు అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, మాజీ కార్పోటర్ బానోతు కల్పన,డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,యూత్ నాయకులు జీవన్,అజయ్,జవహర్,డివిజన్ ముఖ్య నాయకులు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# గురుకుల విద్యాలయానికి ఫ్యాన్ బహుకరణ

•విద్యార్థుల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం.. సేవా కార్యక్రమాలతో దంపతుల వివాహ వార్షికోత్సవం



**వర్ధన్నపేట ప్రతినిధి,ఆగస్టు 27,తరంగాలు** : వివాహ వార్షికోత్సవాన్ని వేడుకలకు మాత్రమే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమానికి వేదికగా మార్చుకున్నారు వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రజాకలం వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఎంజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి--అరుణ దంపతులు. తమ రెండు దశాబ్దాల వైవాహిక జీవితాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల--కళాశాల డార్మిటరీకి ఫ్యాన్‌ను బహుకరించారు.విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత 20 ఏళ్లుగా వృద్ధులు, అనాథ పిల్లలు, రోగులు తదితరులకు తమకు తోచిన రీతిలో సహాయం చేయడం ద్వారా ఆత్మసంతృప్తి పొందుతున్నామని పసునూరి మురళి తెలిపారు.

**సేవలోనే నిజమైన సంతృప్తి**

సమాజంలో అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆడంబరాలకు దూరంగా, తమ సంతోషాన్ని ఇతరుల అవసరాలకు ఉపయోగపడేలా మలచుకోవడమే తమ కుటుంబం అనుసరిస్తున్న విధానమన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందించే చిన్నపాటి సహాయం కూడా వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.దేవుడు చల్లగా దీవిస్తే రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలు, అనాథలు, వృద్ధులు, విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని మురళి తెలిపారు. వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ద్వారా తమ ఆనందాన్ని మరింత రెట్టింపు చేసుకున్నామని ఆయన అన్నారు.

**విద్యార్థుల అవసరాలకు అండగా నిలవాలి**

గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని పలువురు కోరారు. విద్యార్థుల సౌకర్యాల కోసం అందించే ప్రతి సహాయం వారి విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. మురళి--అరుణ దంపతుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కు తున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృ త్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు. తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.

# రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

•అలీపురంలో రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 27, తరంగాలు** : ఖిలా వరంగల్ మండలం అలీపురం గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న భూముల సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని పరిశీలించి, రికార్డులు మరియు క్షేత్రస్థాయి వివరాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు.రీసర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ రిసర్వే పరిశీలనలో లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వెంట ఎడి సర్వే అధికారి శ్రీనివాసులు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు



# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా

వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

# అఫ్గాన్‌తో టి20 సిరీస్‌కు అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు.

# సుగుణమ్మ పార్థివదేహానికి ఉమా మురళి నాయక్ నివాళి





కేసముద్రం ప్రతినిధి , ఆగస్టు 27,తరంగాలు : కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు సంకు వెంకటాద్రి రెడ్డి సతీమణి సంకు సుగుణమ్మ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు భుక్య ఉమా మురళి నాయక్‌కు సమాచారం అందించారు.

దీంతో ఉప్పరపల్లి గ్రామానికి చేరుకున్న డీసీసీ అధ్యక్షురాలు భుక్య ఉమా మురళి నాయక్, ఏఎంసీ చైర్మన్ గంట సంజీవ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ తదితర నాయకులు సుగుణమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం రిటైర్డ్ టీచర్ వెంకటాద్రి రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బండారు దయాకర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు రావుల మురళి, దన్నసరి మాజీ సర్పంచ్ బానోత్ వెంకన్న, 12వ వార్డు కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, గండి శ్రీనివాస్, వార్డు సభ్యులు తండా సంపత్, జెనిగల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్నేని రవీందర్ రావు దంపతులు





హన్మకొండ ప్రతినిధి , ఆగస్టు 28, తరంగాలు: హన్మకొండ హంటర్ రోడ్‌లోని అలకనంద కన్వెన్షన్ హాల్‌లో జరిగిన అద్దంకి హైమ విజయ్‌కుమార్ దంపతుల కనిష్ఠ పుత్రిక పూజ -- చరణ్ వివాహ వేడుకకు మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అనంతరం వడ్డేపల్లిలోని పొద్దుటూరి జువెల్ గార్డెన్స్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నార్లగిరి రాజమణి--రమేష్ దంపతుల కనిష్ఠ పుత్రుడు వినయ్ -- అనూష (వర్షిని) వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే రాంపూర్‌లోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సింగపురం సరోజన--జగన్ దంపతుల ప్రథమ పుత్రిక డా. సింధూర -- క్రాంతి కిరణ్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో అయినవోలు గ్రామ ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, సునీల్, గడ్డం రమేష్, సతీష్, రాజిరెడ్డి, మధు, ఏకాంతం గౌడ్, పొన్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా

వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

# “కాంగ్రెస్ జెండాతోనే నా అంతిమ వీడ్కోలు”

- మునిగ మొగిలి చివరి కోరికకు గౌరవం
- “పార్టీనే ప్రాణంగా భావించిన నాయకుడు”
- మునిగ మొగిలికి కన్నీటి వీడ్కోలు
- మునిగ మొగిలి సేవలకు కాంగ్రెస్ ఘన నివాళి
- చివరి కోరికను నెరవేర్చిన డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్
- పార్టీ కోసం మొగిలి చేసిన సేవలు మరువలేనివి
- ఏఎంసీ చైర్మన్ గంట, మండల అధ్యక్షులు చిలువేరు సమ్మె గౌడ్





కేసముద్రం, ఆగస్టు 27 (తరంగాలు):

కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మునిగ మొగిలి బుధవారం సాయంత్రం స్వర్గస్తులయ్యారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేసిన ఆయన మృతి పార్టీ శ్రేణులకు, కాట్రపల్లి గ్రామ ప్రజలకు తీరని లోటుగా మారింది.మునిగ మొగిలి మృతి విషయం కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ద్వారా డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ దృష్టికి వెళ్లింది. దీంతో వెంటనే కాట్రపల్లి గ్రామానికి చేరుకున్న ఆమె అంతిమక్రియల్లో పాల్గొని మునిగ మొగిలి పార్థివదేహానికి నివాళులర్పించారు.

మరణానంతరం కూడా కాంగ్రెస్ పార్టీ జెండాతోనే తనకు అంతిమ వీడ్కోలు పలకాలని మునిగ మొగిలి కోరుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన చివరి కోరికను గౌరవిస్తూ ఉమా మురళి నాయక్ కాంగ్రెస్ పార్టీ కండువాను పార్థివదేహంపై కప్పి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ, మునిగ మొగిలి కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందించారని, పార్టీ కోసం ఆయన చేసిన సేవలు, కృషి ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, కాట్రపల్లి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం మృతుని భార్య వెంకటమ్మ, కుమారుడు హరీష్, కుమార్తెలు సలీమా, అలీమాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, ఆర్టీఐ మెంబర్ రావుల మురళి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ వీరేష్ యాదవ్, కట్ట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే కాట్రపల్లి సర్పంచ్ ఎదురుబోయిన సూరయ్య, ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జల్లే యాకాంబరం, ఉపాధ్యక్షుడు పుట్ట ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొని మునిగ మొగిలికి ఘన నివాళులర్పించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండాలి

**మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి**



వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 28, (తరంగాలు):అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండాలని

వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ముసాయిదా ఓటర్ జాబితాపై వార్డు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పాల్గొని ఓటర్ జాబితా పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా అధికారులు, బి ఎల్ ఓలు, బిఎల్ఎలు ముసాయిదా ఓటర్ జాబితాను ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాలను పరిశీలించి, పేర్లు లేని అర్హులైన ఓటర్లు, వివరాల్లో తప్పులు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్లకు సంబంధించిన అభ్యంతరాలు, సూచనలు స్వీకరించారు.ఈ సందర్భంగా

చైర్మన్ సారంగపాణి మాట్లాడుతూ ఓటర్ జాబితా



ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడటం, తప్పులను సరిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ముందుగా ఓటర్ జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

## బిఎల్ఓలు, బిఎల్ఎ ల సేవలకు అభినందనలు

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ముసాయిదా ఓటర్ జాబితా ప్రక్రియను 89.99 శాతం పూర్తి చేయడంలో కృషి చేసిన బి ఎల్ ఓలు, బిఎల్ఎలను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, పరిశీలిస్తున్న వారి సేవలు అభినందనీయమన్నారు. మిగిలిన ప్రక్రియను కూడా సమన్వయంతో పూర్తి చేసి పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ జాబితా రూపొందించాలని సూచించారు.

ఓటర్ జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న చైర్మన్, ప్రతి వార్డు ప్రజలు తమ పేర్లతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు, వివరాలను పరిశీలించుకోవాలని కోరారు. అర్హులైన వారి పేర్లు లేకపోయినా, అనర్హులు లేదా మరణించిన వ్యక్తుల పేర్లు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ కమ్మం కృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, బి ఎల్ ఓలు, బిఎల్ఎలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దళిత చైతన్య మహాసభను విజయవంతం చేయాలి

**దళిత డిపార్ట్మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్,వైస్ చైర్మన్ జన్ను గణేష్**



వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 27,తరంగాలు : ఆగస్టు 30న నిర్వహించనున్న దళిత చైతన్య బహిరంగ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని దళిత డిపార్ట్మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జన్ను గణేష్ పిలుపునిచ్చారు.వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దళిత చైతన్య మహాసభను విజయవంతం చేయడానికి నాయకులు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో దళిత డిపార్ట్మెంట్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జన్ను గణేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఆగస్టు 30న ఐగ్రేవచారి మైదానంలో నిర్వహించనున్న దళిత చైతన్య బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించే అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. దళితుల హక్కులు, అభివృద్ధి, సామాజిక సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడమే సభ ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు.

సమావేశం అనంతరం దళిత డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ జన్ను గణేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ దళిత చైతన్య మహాసభకు దళితులు, యువత, మహిళలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దళిత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతో పాటు, దళితుల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ అభ్యున్నతికి అవసరమైన కార్యాచరణపై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యతతో ముందుకు సాగి భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని జన్ను గణేష్ కోరారు.